క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ ఐరన్ యార్డు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని విద్యుత్ ఆఫీస్ ఎదుట పాత ఎంఐజీ బ్లాకులతో పాటు ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్ యార్డు, రిలయన్స్ పక్కన పడమటవారి వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందితో సహకరించాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కృష్ణలంక పీఎస్ సీఐ ఏ మురళీకృష్ణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు స్టేషన్ ఆవరణంలో ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. నేరచరితులు నేరప్రవృత్తిని విడనాడి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. నేరచరితులపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రకాష్‌రావు, మనోహర్, కృష్ణసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

పప్పు నరసింహారావు సేవలు చిరస్మరణీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎయిడెడ్ ఉద్యోగుల సంఘ నేత, కేబీఎన్ కళాశాల పూర్వ మేనేజర్ పప్పు నరసింహారావు సేవలు చిరస్మరణీయమని ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. పప్పు నరసింహారావు సంస్మరణ సభ ఆ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాలలో 1965లో చేరిన పప్పు నరసింహారావు సుమారు 50 సంవత్సరాల పాటు విశేషమైన సేవలందించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. కోస్తా జిల్లాల్లో అనేక కళాశాలలకు ఆయన సేవలు అందించారని చెప్పారు. కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, రిటైర్డ్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ ఈశ్వర్‌ప్రసాద్, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శశికళ, రిటైర్డ్ అధ్యాపకులు నరేంద్ర, ఎస్.సాంబమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, కళాశాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పటమట(విజయవాడతూర్పు): చర్మ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ రాశినేని నీలకంఠ అన్నారు. పటమటలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమభావన మిత్ర మండలి విజయవాడ శాఖ 96వ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శరీరంలో చర్మం ప్రధాన భాగమని, శిరస్సు మీద ఊడిపోయిన వెంట్రుకలకు బదులుగా మళ్లీ వెంట్రుకలను శాశ్వతంగా ఏర్పరవచ్చని చెప్పారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు సాధారణంగా తామర, గజ్జి వస్తాయని చెప్పారు. ఇలా రావటానికి శరీరం పొడిగా లేకుండా ఉండడమే కారణమని, ఎల్లప్పుడూ పొడి వస్త్రాలు మాత్రమే ధరించాలని సూచించారు. అనంతరం మండలి సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్ర, ప్రతినిధులు యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆచార్య, పీఆర్కే ప్రసాద్, డాక్టర్ ఎంపీ రావు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేస్తేనే రాష్ట్రానికి మేలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్



41వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆసిఫ్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మంచి మనసున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రానికి అన్ని విధాలా మేలు జరుగుతుందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. గట్టు వెనుక ప్రాంతంలోని 41వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన గడప గడపకు విస్తృత పర్యటన చేశారు. తొలుత 41వ డివిజన్ పరిధిలోని దళితవాడలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని వివరించారు. అలాగే రంగూన్ సాహెబ్ వీధి, మీరాసాహెబ్ వీధిలో తిరిగారు. ఆయా ప్రాంతాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే రంగూన్ సాహెబ్ వీధిలోగల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ సిబ్బందితో మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో ఇక్కడికి వచ్చే పేషెంట్లను ప్రేమతో మర్యాదపూర్వకంగా పలకరించి వారికి వైద్య సేవలను అందించాలని సూచించారు. ఇక్కడ చికిత్స చేయటం సాధ్యంకాని వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేయాలని చెప్పారు.

ఆదుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం

పశ్చిమ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇప్పటికే నాలుగు ఆరోగ్య కేంద్రాలను సీఎం జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాటి ద్వారా అనేక మంది వివిధ రక్తపరీక్షలతోపాటు నెలకు సరిపడా ఉచితంగా మందులుకూడా ఇస్తున్నారని ఆసిఫ్ చెప్పారు. అదే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నియోజకవర్గ ప్రజలు అనేక మంది ఉచిత వైద్య సేవలను పొందారని తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆస్పత్రులను కూడా అభివృద్ధి చేయటం అందులో భాగమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీ పథకాన్ని పునర్జీవం చేయటమే కాకుండా మరిన్ని రోగాలను చేర్చి మూడు వేలకు పైగా తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, పార్టీ నాయకులు అబ్దుల్ రెహమాన్, ఎండీ గౌసీ, లాజర్, గెత్తం ఆనంద్, ఎండీ ఇషాక్, జంగం ఆనంద్, జోసఫ్ శివమణి, జీఎంసీ అల్తాఫ్, బడేమియ, సర్తాజ్, కర్ల అజిత్, అల్లాభక్షు, నసీమ, షబ్బీర్, ఫారూఖ్, మైలవరపు దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియదర్శిని కాలనీలో పర్యటన



42వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న ఆసిఫ్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆదివారం సాయంత్రం 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో ప్రియదర్శిని కాలనీలో పర్యటించారు. గతంలో ఆయన కాలనీలో గడప గడపకు పర్యటించిన సందర్భంలో అందరూ సుపరిచితులు కావడంతో ప్రతి ఇంటికి వెళ్లి అందరినీ పేరుపేరున ఆప్యాయంగా పలకరించారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక కార్పొరేటర్ చైతన్యరెడ్డికి తెలియజేయాలని, తద్వారా వాటిని పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామని కాలనీవాసులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'సిద్ధం' పిలుపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కార్పొరేటర్ చైతన్యరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి కట్ చేశారు. రానున్న ఎన్నికల్లో పేదలు, పెత్తందార్ల మధ్య జరిగే యుద్ధానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలంతా 'సిద్ధం'గా ఉన్నారని తెలిపారు. ఎన్ని ప్రతిపక్ష జెండాలు కలిసినా ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా పెట్టుకున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఆసిఫ్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు పడిగపాటి చైతన్యరెడ్డి, అర్షద్, మండేపూడి చటర్జీ, మహదేవు అప్పాజీ, ఎండీ ఇర్ఫాన్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, పార్టీ నాయకులు తుమ్మా ఆదిరెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, లక్ష్మి, మండల శ్రీను, యరజర్ల మురళి, కేసరి చిన్నోడు, యు.శ్రీనివాసరెడ్డి, రోశిరెడ్డి, ఎండీ అఫీజ్, సాంబిరెడ్డి, వీఎన్ఎస్ కుమార్, కె.చిరంజీవరావు, ఎ.శ్రీనివాసరెడ్డి, జి.రమణారెడ్డి, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



ఎమ్మెల్యే వెలంపల్లిని సత్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నడకతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్‌– 202 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పాతబస్తీలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణంలో ఆదివారం జరిగింది. క్లబ్ గవర్నర్‌గా న్యాయవాది చిన్నం రామకృష్ణ, జిల్లా కార్యదర్శిగా కేవీ సూరిబాబు, కోశాధికారిగా జి.మురళీకృష్ణ వారి క్యాబినెట్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెలంపల్లి వారికి క్లబ్ తరుపున హెల్త్ కార్డులను అందజేశారు. వాకర్స్ అసోసియేషన్లను ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. డిస్ట్రిక్ట్ 202 పరిధిలో సుమారు 200 క్లబ్‌లు, 9 వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహనరావు, ఆడిటర్ పెనుగొండ సుబ్బరాయుడు, క్లబ్ ప్రముఖులు తొండెపు హనుమంతరావు, సీహెచ్ మన్మథరావు, న్యాయవాదులు కోట జయరాజు, ఏవీ రమణ తదితరులు ప్రసంగించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా, భానుశ్రీ మ్యూజిక్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు సయ్యద్‌ఆలీ, భానుశ్రీ ఆధ్వర్యంలో పావని, సత్యనారాయణ, విజయ్, వంశీ, వీరశేఖర్ రాంబాబు తదితరులు భక్తి గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొత్తా పూర్ణానందం హాల్‌లో అలనాటి మధుర గాన లహరి కార్యక్రమం నిర్వహించారు. తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆలపాటి అశోక్‌కుమార్, మిలటరీ కోటేశ్వరరావు, సాంబశివరావు, పీ రంగనాథం, అంజుస్వామి తదితరులు సినీ గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను సత్కరించారు. చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు గాయకులను అభినందించారు.

● అంబేడ్కర్ స్మృతివనం.. కోలాహలం

నగరంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతివనంలో కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు. స్మృతివనంలోని అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, ఫౌంటెన్లు, వివిధ ఆకృతులను ఆసక్తిగా తిలకించారు. ఆయా దృశ్యాలను సందర్శకులు వీక్షించి, మొబైల్ ఫోన్లలో బంధించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









నేడు వీఎంసీ 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులు పౌష్టికాహార లేమితో బాధపడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తమ వంతు బాధ్యతగా ట్రస్ట్ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ బాధిత చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాత ప్రభుత్వాస్పత్రి కౌన్సిలర్ కనకాల వరప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రహీమా, వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో ఉన్నత శిఖరాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ) కేజీవీ సరిత అన్నారు. శారదా జూనియర్ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. సభలో సరిత మాట్లాడుతూ విద్యార్థులకు స్థిరమైన లక్ష్యాలు ఉండాలని సూచించారు. అంకిత భావంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన సాధన చేయాలన్నారు. గత సంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, శారదా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర శర్మ, కళాశాల కమిటీ ప్రెసిడెంట్ ఆర్.డి షా, సెక్రటరీ కుందాసీతారామశాస్త్రి, కరెస్పాండెంట్ ఎస్.ఎన్.వరప్రసాద్, శారదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, స్కూల్ ప్రిన్సిపాల్ మూర్తి, ఈసీ సభ్యులు శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ దుర్గ, అడపా శేషు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్ ఆవరణంలో ఆదివారం కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు ఆధ్వర్యంలో సెంటినీ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఆర్థో, ఊపిరితిత్తులు, కిడ్నీ, నరాలు, జీర్ణకోశ, గుండె సంబంధిత వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందించారన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ.. ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, దేవినేని అవినాష్ బావ వై.సిద్ధార్థ్, వైద్యులు ఎస్.అనిల్, దోనె ఇందిర, కె.హరీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెం రవి, నిమ్మల జ్యోతిక, సురేష్‌వర్మ పాల్గొన్నారు.

'పవన్ కళ్యాణ్‌కు రాజకీయ సమాధి తప్పదు'



డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆర్టికల్ 21కు వక్రభాష్యాలు చెబుతూ కులగణనకు వ్యతిరేకంగా కుట్రకు తెరలేపిన పవన్ కళ్యాణ్‌కు బీసీలు రాజకీయ సమాధి కడతారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ అన్నారు. స్థానిక ముత్యాలంపాడులోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్టికల్ 21 ప్రకారం జీవితానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ చట్టం ద్వారా ఏర్పరచబడిన విధానం ప్రకారం తప్ప ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదన్నారు. కులగణన ద్వారా ఏవిధంగా రాజ్యాంగానికి విఘాతం కలుగుతుందో, ప్రజల ప్రాథమిక హక్కులకు ఏ విధంగా భంగం వాటిల్లుతుందో పవన్ కళ్యాణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. జీవించే హక్కుతో పాటు గౌరవంగా జీవించే హక్కును ప్రజలకు అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తూ రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుట్టారన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని చేత పట్టుకుని ఫొటోలు దిగడం కాకుండా దాన్ని చదివి అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని హితవు పలికారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, డివిజన్ బాధ్యులు గోదావరి బాబు ఆదివారం పంపిణీ చేశారు. డివిజన్‌లోని 148, 151 సచివాలయాల పరిధిలో 668 ఆరోగ్యశ్రీ కార్డులను స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గోదావరి గంగ మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తోందన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింప చేసే ప్రైవేట్ హాస్పిటల్స్‌లోనూ వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చని చెప్పారు. లక్షల రూపాయలు ఖర్చయ్యే సర్జరీలు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా చేస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఇప్పటికే అనేక మంది వైద్య సేవలను అందుకున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడపంగు క్రాంతి కుమార్, సచివాలయం అడ్మిన్ రాజీవ్, హెల్త్ సెక్రటరీ లక్ష్మి, వలంటీర్లు కిరణ్, హారిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ధర్మారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సత్యనారాయణపురంలో ఆదివారం అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ(మానవ సేవా సంఘం) ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు సొసైటీ సభ్యులతో కలిసి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు విద్యార్థులను ఉత్తేజపరిచేలా ప్రసంగించారు. పేద విద్యార్థులకు విద్య దూరం కాకూడదనే మహోన్నత ఆశయంతో అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ ప్రతీ ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా తమ జీవితాల్లో ఒక గొప్ప స్థాయిని పొందవచ్చని తెలిపారు. మధ్యతరగతి కుటుంబాలలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉంటాయో తనకు తెలుసన్నారు. పేదరికం అనేది తొలగించుకోవడం విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తాను చాలా దిగువ స్థాయి కుటుంబం నుంచి అంచలంచలుగా ఎదిగిన క్రమాన్ని ఆయన వివరించారు. వ్యాపారవేత్తలుగా రాణించాలనుకునే వారు తమ చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తే ఒక మంచి వ్యాపారవేత్తగా ఎదిగేందుకు కావలసిన అవకాశాలు ఉంటాయన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చాలా నిధులు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో స్వచ్ఛంద సంస్థల సాయం కూడా అవసరం ఉంటుందని చెప్పారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని రానున్న రోజుల్లో ఇదే విద్యార్థులు మరి కొంతమందికి సాయం చేసే స్థితికి రావాలని ఆకాంక్షించారు. సంస్థ అధ్యక్షుడు బడేటి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నంద్యాల కృష్ణమూర్తి, ఆత్మీయ అతిథులుగా ఆంధ్రా హాస్పిటల్ జీఎం డాక్టర్ ఎన్‌వీ హరికుమార్, కేవై కొండలరావు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. బొమ్మదేవర సుబ్బారావు, జగన్‌మోహన్‌రావు, సీతయ్య, ఉప్పు రంగప్రసాద్, సింగలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

మన విజయవాడలో
డా॥రమేష్ కార్డియాక్ & మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రై.లి. వారు
ఎం.జి.రోడ్, లబ్బీపేట, విజయవాడ-02
డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అనుమతి పొందియున్నారు. కావున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు రియంబర్స్‌మెంట్ సౌకర్యం పొందే అవకాశాన్ని ఉపయోగించుకోగలరు.
0866-2463 463
98 48 527 113

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేయడంతో పాటు దాడి చేసి గాయపరిచిన భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కేఎల్ రావు నగర్ 5వ లైన్‌కు చెందిన పోలవరపు మేరీ, నాగదుర్గారావులు ఏడేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ముఠా పని చేసే నాగదుర్గారావు గత కొంత కాలంగా మద్యానికి బానిసై భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం తెల్లవారుజామున భార్య వద్దకు వెళ్లిన నాగదుర్గారావు గొడవ పెట్టుకోవడమే కాకుండా కర్రతో కొట్టాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ దినవహి వారి సత్రం
లింగంబొట్ల వారి వీధి, 1టౌన్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా

టెండరు-కమ్-బహిరంగ వేలం ప్రకటన

పై సంస్థకు చెందిన ఈ క్రింది పేర్కొనియున్న 8 షాపులకు 3 సంవత్సరములకు లైసెన్సు పై నెలవారి అద్దె చెల్లించుటకు గాను టెండరు-కమ్-బహిరంగ వేలం ద్వారా ది. 08-02-2024 గురువారం ఉదయం గం. 11.00 లకు సదరు సత్రము షాపుల వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు మరియు కార్యనిర్వహణాధికారిచే బహిరంగ వేలము జరుపబడును

షాపు నెం.	డోరు నెం.	షాపు విస్తీర్ణం చ.అడుగులు	ధరావత్తు	అడ్వాన్సు సొమ్ము
1	11-48-2	21x11 (247)	50,000/-	12 నెలల అద్దె
2	11-48-2	21x11 (247)	50,000/-	12 నెలల అద్దె
3	11-48-2	21x11 (247)	50,000/-	12 నెలల అద్దె
4	11-48-2	21x11 (247)	50,000/-	12 నెలల అద్దె
5	11-48-2	9x14 (133)	50,000/-	12 నెలల అద్దె
6	11-48-208	9x14 (133)	50,000/-	12 నెలల అద్దె
7	11-48-208	13x8 (105) మెట్ల క్రిందీ భాగము నందు	10,000/-	12 నెలల అద్దె
8	11-48-208	3x22 (69)	10,000/-	12 నెలల అద్దె

షరతులు: 1) ముందుగ సత్రము పేర రూ. 50,000/- డిమాండ్ డ్రాఫ్ట్ లేదా నగదు మరియు ఆధార్ కార్డు, ఒక ఫోటో, ఒరిజినల్ ట్రేడ్ లైసెన్సు సమర్పించి పాట నందు పాల్గొను నిర్ణయము. 2) పాట కొట్టివేసిన వెంటనే హెచ్చుపాటదారు 12 నెలల అద్దె అనగా ఒక సంవత్సరం అద్దె సెక్యూరిటీ డిపాజిట్ వెంటనే చెల్లించవలెను. దీనికి ఎటువంటి వడ్డీ ఇవ్వబడదు. అద్దె కాలపరిమితి ముగిసినపిదప ప్రథమ ధరావత్తు, సెక్యూరిటీ డిపాజిట్ చూసుకొని తిరిగి ఇవ్వబడును. మిగిలిన పాట షరతులు సత్రం కార్యాలయం పనిచేయువేళలయందు తెలుసుకొనవలెను.

విజయవాడ, ది. 29-01-2024 ఎస్. అరుణ, కార్యనిర్వహణాధికారి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com